సంతలో గుత్తేదారుల దందా

- వేలంలో సంతను దక్కించుకున్న కూటమి పార్టీ నేతలు
- వారం గడిచినా పంచాయతీకి నగదు జమ చేయని వైనం
- అప్పుడే సంతలో వసూళ్లు
- అధికార పార్టీ నేతలకు కొమ్ముకాస్తున్న అధికార యంత్రాంగం



ఆదివారం సాయంత్రం చంద్రగిరిలో జరుగుతున్న వారపు సంత

చంద్రగిరి: పంచాయతీ ఆదాయానికి గండికొడుతూ గుత్తేదారులు దందాకు దిగారు. ఇప్పటికే అధికార పార్టీ నేతల నిర్వాకం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంచాయతీకి సుమారు రూ.5 లక్షల మేర నష్టం వచ్చింది. ఇప్పుడు ఏకంగా వేలంలో పాడిన నగదును చెల్లించకుండానే సంతలో అనధికారికంగా వసూలు చేయడంపై విమర్శలకు తావిస్తోంది. గత నెల 29న చంద్రగిరి వారపు సంత, బస్టాండ్, జంతు వధశాలకు బహిరంగ వేలం నిర్వహించారు. గుత్తేదారులు సుమారు రూ.34.07 లక్షలకు దక్కించుకున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరత్నం ప్రకటించారు. వారంలోపు గుత్తేదారులు వేలంలో పాడిన మొత్తం నగదును చెల్లించాలని, తర్వాతే వసూళ్లు చేసుకోవాలనే నిబంధనలు ఉన్నాయి.

రూపాయి చెల్లించకుండానే..

నిబంధనల మేరకు వారం రోజులలోపు వేలంలో పాడుకున్న నగదును పూర్తిగా చెల్లించాలని, ఆపై అధికారుల అనుమతులతో నిబంధనల మేరకు గుత్తేదారులు వసూలు చేసుకోవాలి. అయితే వారం రోజులు పూర్తయినా కూడా వారపు సంత, బస్టాండ్, జంతువధ శాలకు సంబంధించి గుత్తేదారు ఒక్క రూపాయి కూడా చెల్లించలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం వారపు సంతలో సైతం గుత్తేదారులు వసూళ్లు చేసుకునేందుకు పూజలు చేసి హడావుడి చేశారు. అయితే రూ.34.04 లక్షల నగదును చెల్లించకుండానే వసూళ్లు చేయడం గత 20 ఏళ్లలో ఏనాడు చోటు చేసుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు. ప్రభుత్వ అధికారులు, అధికార పార్టీ నాయకులకు తొత్తులుగా మారడంతోనే ఇలాంటివి జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎలాంటి సమాచారం లేదు..!

పంచాయతీ ఆదాయ వనరులను వేలంలో దక్కించుకుని, ఇప్పటి వరకు ఎంత నగదు చెల్లించారో వివరాలు తెలపాలని సర్పంచ్ ముదికుప్పం రూపరామ్మూర్తిని కోరగా..తన వద్ద ఎలాంటి సమాచారం లేదన్నారు. ఇప్పటి వరకు ఎవరు ఎంత నగదు చెల్లించారో తెలియదని, సిబ్బందిని సంప్రదించి ఆపై వివరాలను వెల్లడిస్తానంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కూటమి నేతలకు అనుకూలంగా మారారనడానికి ఇదొక నిదర్శనంగా చెప్పుకోవచ్చు. ఇకనైనా జిల్లా పంచాయతీ అధికారులు చంద్రగిరి ఆదాయ వనరులపై దృష్టి సారించి, గుత్తేదారుల నుంచి వేలం పాట నగదును జమ చేయించుకోవాల్సిన అవసరం ఉంది.

క్లుప్తంగా

జ్యోతిబాబుకు నివాళి



సేతురామ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతి చెన్నారెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న సేతురామ్ తండ్రి జ్యోతిబాబు ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి నగరంలోని సేతురామ్ ఇంటికి వెళ్లి ఆయన తండ్రి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో పార్టీ నాయకులు షేక్ ఇమ్రాన్‌బాష, బొగ్గుల వెంకటేష్ ఉన్నారు.

వృద్ధులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న మాజీ ఎంపీటీసీ సీఎం కేశవులు

చంద్రగిరి: మండల పరిధిలోని నాగయ్యగారిపల్లి వృద్ధాశ్రమంలో ఆదివారం చంద్రగిరి మాజీ ఎంపీటీసీ, సీఎం కేశవులు అన్నదాన కార్యక్ర మం నిర్వహించారు. ఏటా శ్రీరామనవమిని పురస్కరించుకుని ఆయన అన్నదానం చేస్తున్నా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డ ల ఆదరణ కోల్పోయిన వృద్ధులకు అన్నదానం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఏటా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస నిలయం సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



నాగాలమ్మ ఆలయ ఆవరణలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి

చంద్రగిరి: వేసవి నేపథ్యంలో భక్తులు, ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు నాగాలమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. మల్లయ్యపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మీసాల ప్రతాప్ రెడ్డి తన సొంత నిధులతో చలివేంద్రం ఏర్పాటు చేశారు. అనంతరం దాత మాట్లాడుతూ ప్రస్తుతం ఎండ తీవ్రతతో ప్రజలు, ఆలయానికి వచ్చే భక్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, అందుకోసం ఉచితంగా చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. మొదటి రోజు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు నగరి చంద్ర, కొత్తపాటి మదన్ మోహన్ రెడ్డి, మురగయ్య, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.

హనుమంతుడిపై కల్యాణ వెంకన్న విహారం



భక్తులను కటాక్షిస్తున్న శ్రీనివాసుడు

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారు కోదండరాముడి అలంకరణలో హనుమంత వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారు హనుమంతుడిపై అధిరోహించి గ్రామంలో తిరుగుతూ భక్తులకు ఆశీస్సులు అందించారు. శ్రీరామనవమి పర్వదినాన హనుమంతుడిపై విహరిస్తున్న శ్రీరాముని దర్శనార్థం తరలివచ్చిన భక్తులు కర్పూర హారతులు పట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. హనుమంత వాహన సేవలో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డితో పాటు భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి: చంద్రగిరి శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో ఆదివారం ఉదయం ధ్వజారోహణంతో వార్షి క బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 8 నుంచి 9 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం ఘట్టం నిర్వహించారు. ఇందులో గరుత్మంతుడి చిత్రంతో కూడిన ధ్వజపటానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అర్చకుల వేదమంత్రోచ్చరణలు, భక్తుల రామనామ స్మరణ మధ్య ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపైకి అధిష్టింపచేశారు. కంకణభట్టార్ శ్రీనివాసభట్టార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ దేవేంద్ర బాబు, పలువురు అధికారులు విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి గాంధీ రోడ్: భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని తిరుపతిలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్ రెడ్డి, సెంట్రల్ మండల అధ్యక్షుడు దీపక్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రధాన తపాలా కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. అనంతరం నాయకులు యువకులు, పెద్దఎత్తున నగరంలో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ రెండు ఎంపీ సీట్లతో ప్రారంభమైన బీజేపీ ప్రస్థానం ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వం కలిగిన పార్టీగా ఆవిర్భవించిందన్నారు. సుబ్రహ్మణ్యం రెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, గురు ప్రసాద్, రాజశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల వితరణ



శ్రీరామనవమి వేడుకలు నిర్వహిస్తున్న క్షత్రియ ఉద్యోగ సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: టీటీడీ క్షత్రియ ఉద్యోగుల సంఘం, తిరుపతిలోని రాజు క్షత్రియులు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం తూకివాకంలోని ఆశ్రమ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వారు వృద్ధులు, ప్రత్యేక ప్రతిభావంతుల కేంద్రానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, బిస్కెట్లు, పండ్లు వితరణ చేశారు. శ్రీరామనవమి సందర్భంగా ఆశ్రమంలో శ్రీసీతా సమేత శ్రీరాముల వారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు శోభారాణి, రమేష్, శంకర్‌రెడ్డి, గౌతమ్, రుక్మాంగదరాజు, బాలరాజు, సుబ్రమణ్యం రాజు, శ్రీధర్‌రాజు, మధు శేఖర్ రాజు, సుకుమార్ రాజు, మాధవరాజు, రుద్రరాజు, లక్ష్మి, రేవతి, గోవర్ధనరాజు పాల్గొన్నారు.

తానా పురస్కార గ్రహీతలకు సత్కారం



తానా పురస్కారాల గ్రహీతలను సత్కరిస్తున్న రచయితలు, సాహితీ మిత్రులు

తిరుపతి కల్చరల్: తానా, మంచి పుస్తకం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల నవలల పోటీల్లో ఇటీవల తానా పురస్కారాలు అందుకున్న రచయితలు ఆర్సీ కృష్ణస్వామి రాజు, పేట యుగంధర్‌ను సాహితీ వేత్తలు, రచయితలు ఆదివారం ఓ ప్రైవేటు హోటల్లో ఘనంగా సత్కరించి అభినందించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా చరిత్రలోనే బాలసాహిత్యంలో తానా బాలసాహిత్యం అవార్డు రావడం , ఇందులో ఇద్దరి రచయితలకు ఒకేసారి రావడం గర్వించదగ్గ విషయమని సాహితీమిత్రులు కొనియాడారు. వీరి నుంచి భవిషత్‌లో మరిన్ని మంచి బాల సాహితీ రచనలు రావాలని ఆకాంక్షించారు. సత్కరించిన వారిలో రచయితలు పల్లిపట్టు నాగరాజు, కేవీ మేఘనాథ్‌రెడ్డి, మాణిక్యం, సాహితీ మిత్రులు ఉన్నారు.

శ్రీరామ రామ రామేతి

- అట్టహాసంగా శ్రీరామనవమి వేడుకలు
- భక్తులతో కిక్కిరిసిన కోదండరామాలయం



తిరుచానూరు శ్రీరామమందిరంలో నవమి వేడుకలు

తిరుపతి కల్చరల్: నగరంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీకోదండ రామస్వామి ఆలయంలో తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి మూలవర్లకు అభిషేకం చేశారు. అనంతరం ఉదయం 8 నుంచి 9 గంటల ఊంజల్ మండపంలో శ్రీసీతారామ లక్ష్మణ సమేత హనుమంతుల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. శ్రీరామ నవమి పర్వదినం కావడంతో ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు శ్రీసీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తిని వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు శ్రీవారి సేవకులు పానకం, వడపప్పు ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా సాయంత్రం 3 నుంచి 4 గంటల వరకు పెద్దజీయర్‌స్వామివారి మఠం నుంచి అర్చకులు నూతన వస్త్రాలను విమాన ప్రదక్షిణగా వచ్చి స్వామివారి మూలవర్లకు, ఉత్సవమూర్తులకు సమర్పించారు. తర్వాత శ్రీరామ జన్మపురాణం, ఆస్థానం నిర్వహించారు. సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ, అనంతరం ఉత్సవమూర్తులను వాహన మండపానికి వేంచేపు చేశారు. కాగా రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శ్రీరామచంద్రమూర్తి తన ప్రియభక్తుడైన హనుమంత వాహనాన్ని అధిష్టించి ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పెద్దకాపు వీధిలో..

తిరుపతి కల్చరల్: పెద్దకాపు వీధిలోని అత్యంత పురాతనమైన రామ మందిరంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానికులు, భజన మండలి కళాకారులు సంయుక్తంగా రామనామ సంకీర్తనలు చేశారు. కార్యక్రమంలో భజన మండలి కళాకారులు, భక్తులు పాల్గొన్నారు.

తిరుచానూరులో...

తిరుపతి రూరల్ : తిరుచానూరు గ్రామంలోని రాముల వారి ఆలయంలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. కిట్టప్ప స్వామి, ఆర్య వైశ్య నిత్యాన్నదానం సేవ సమాజం వారి ఆధ్వర్యంలో ఈ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీసీతారాముల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి నవమి వేడుకలు చేపట్టారు. గ్రామం నుంచి వచ్చిన భక్తులు అందరికీ వడపప్పు, పానకం పంపిణీ చేశారు. శ్రీ పద్మావతి ఆర్య వైశ్య నిత్యాన్నదాన సేవసమాజం వారికి అనుబంధం కావడంతో ప్రెసిడెంట్ టి.సతీష్ కుమార్, సెక్రటరీ సతీష్, కోశాధికారి రవి, యువకిరణాల అధ్యక్షుడు కళ్యాణ్, తారక, ఇందిరా, కుమారి, కుసుమ, కళావతి, రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల : మండలవ్యాప్తంగా శ్రీరామనవమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. స్థానిక రైల్వేక్వార్టర్స్‌లోని కోదండ రామాలయంలో, దామలచెరువు రామాలయంలో, పెద్దగొర్పాడు కోదండ రామాలయాల్లో వేదపండితులు సీతారాముల కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.



ధ్వజస్తంభానికి ప్రత్యేక పుష్పాలంకరణ



పెదకాపువీధిలో..



పాకాల:అలంకరణలో సీతారాముల ఉత్సవమూర్తులు

నేడు ఎంపీపీ బాధ్యతల స్వీకరణ

తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం ఎంపీపీగా మూలం చంద్రమోహన్ రెడ్డి సోమవారం ఉదయం 9 గంటలకు ఎంఆర్‌పల్లి వద్ద ఉన్న తిరుపతి రూరల్ మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. గతనెల 27వ తేదీన జరిగిన ఎంపీపీ ఎన్నికల్లో మూలం చంద్రమోహన్‌రెడ్డి గెలిచిన విషయం విదితమే. ఈ మేరకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డితో పాటు తిరుపతి రూరల్ మండలంలోని ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, పార్టీ నేతలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొనాలని మూలం చంద్రమోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

రూ.10 లక్షల ఆస్తినష్టం



కాలిన కేబుళ్లను పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

తిరుపతి రూరల్: తిరుపతి నగరంలోని అలిపిరి సెక్షన్ పరిధిలో గల 132 కేవీ రుయా హాస్పిటల్ అండర్ గ్రౌండ్ కేబుల్స్‌కు గుర్తు తెలియని వ్యక్తులు మంట పెట్టడంతో 3 కేబుల్స్ కాలిపోయాయి. దీంతో విద్యుత్ శాఖకు రూ.10 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లిందని ఎస్ఈ సురేంద్ర నాయుడు తెలిపారు. ఆదివారం సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఆయన ఘటన జరిగిన తీరుపై విచారణ చేయాలని తమ సిబ్బందికి ఆదేశించారు. తక్షణం పాదచారులకు ఇబ్బంది కలగకుండా వెంటనే మరమ్మతులు ప్రారంభించాలని ఆదేశించారు. ఇలాంటి సమస్య పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ఎస్ఈ సురేంద్రనాయుడు ఆదేశాలతో విద్యుత్ అధికారులు స్పందించి ప్రత్యామ్నాయంగా చర్యలు చేపట్టి ఆస్పత్రి పరిసరాల్లో విద్యుత్ సరఫరా అందించారు. ఇందులో ఎస్ఈ సురేంద్ర నాయుడుతో పాటు టౌన్ డివిజన్ ఈఈ చంద్రశేఖర్‌రావుతో కనస్ట్రక్షన్ ఈఈ బాలాజీ పాటు విద్యుత్ ఏడీలు ఆంజనేయులు, మునిప్రసాద్, ఏఈలు ఉమాపతి, బాష తదితరులు ఉన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

తిరుపతి రూరల్ : తిరుచానూరు శిల్పారామంలో శ్రీరామనవమి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సాయంత్రం 6.30 గంటల నుంచి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. కేరళ నాట్య కళాలయం, పుత్తూరు నుంచి వచ్చిన చిన్నారుల ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. 'గణనాయకాయ గణదైవతాయ' పాటతో మొదలై శ్రీరామనవమి పండుగ పర్వదినాన్ని చాటిచెప్పే భక్తి పాటలకు చేసిన నృత్య ప్రదర్శనలకు ప్రేక్షకులు చప్పట్లతో అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నృత్య శిక్షకురాలు సుజాత, రాధాకృష్ణన్, పరిపాలన అధికారి సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు టీటీడీ పరిపాలనా భవనం నుంచి ఏనుగుపై ముత్యాల తలంబ్రాలు ఊరేగింపుగా శ్రీకోదండరామాలయానికి వేంచేపు. రాత్రి 7 గంటల నుంచి శ్రీసీతారాముల కల్యాణం, వాహనసేవ
- విద్యుత్ కార్మికుల రిలేనిరాహార దీక్షలకు మద్దతుగా ఉదయం 10 గంటలకు ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల మహాధర్నా
- రాముల వారి దక్షిణ మాడవీధిలోని చిగోరా ఆధ్యాత్మిక కేంద్రంలో ఉదయం 10.45 గంటలకు విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ 164 జయంతి వేడుకలు
- మంజుల కళానిధి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సాయంత్రం 5.30 నుంచి 8.30 గంటల వరకు సాంస్కృతిక ఉత్సవాలు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

తిరుపతి తుడా: నగర పాలక సంస్థ కార్యాలయంలో వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎన్.మౌర్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోన్ ద్వారా ఫిర్యాదులు చేసేవారు 0877–2227208 నంబర్‌కు కాల్ చేసి మాట్లాడవచ్చని సూచించారు. ఈ కార్యక్రమాలను నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్పెషల్ డ్రైవ్‌కు డుమ్మా

తిరుపతి తుడా: టీడీఆర్ బాండ్ల జారీలో భాగంగా నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌కు ఆదివారం అధికారులు డుమ్మా కొట్టారు. మూడోరోజు ఆదివారం కూడా స్పెషల్ డ్రైవ్ ఉంటుందని కమిషనర్ మౌర్య ప్రకటించారు. ఈ క్రమంలో టీడీఆర్ స్పెషల్ డ్రైవ్‌లో తమ ఫిర్యాదులను, సంబంధిత డాక్యుమెంట్లను ఇచ్చేందుకు పలువురు బాధితులు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి తరలివచ్చారు. అయితే స్పెషల్ డ్రైవ్ కోసం నియమించిన అధికారులు ఎవరూ హాజరు కాకపోవడంతో బాధితులు అసంతృప్తితో వెనుదిరిగారు. ఆదివారం కూడా కొనసాగుతుందని ప్రకటించడంతో పనులు వదులుకుని గంటల తరబడి ఎదురు చూసినా అధికారులు ఎంతకూ రాకపోవడంతో చేసేదిలేక వెనుదిరిగారు. కొన్ని సచివాలయాల్లో వార్డ్ ప్లానింగ్ సెక్రటరీలు మాత్రం అందుబాటులో ఉండగా.. వారితోనే మమ అనిపించి చేతులు దులుపుకున్నారు.

నూతన కమిటీ ఎంపిక



నూతన అధ్యక్ష, కార్యదర్శులతో కమిటీ సభ్యులు

తిరుపతి తుడా: తిరుపతి ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ సమావేశం ఆదివారం ఏపీఎన్‌జీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన ప్రెసిడెంట్ హరి (సజ్జన్ హరి), ప్రధాన కార్యదర్శిగా గోపిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రెసిడెంట్ హరిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చెరుకు సందీప్ రెడ్డి, ట్రెజరర్ అశోక్, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్లు డాక్టర్ జేడీఎస్ థామస్, సాంబశివరావు, కమిటీ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు, సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



శ్రీవారి ఆలయం వెలుపుల హోం మినిస్టర్ అనిత

తిరుమల: తిరుమల శ్రీవారిని ఆదివారం హోం మినిస్టర్ అనిత, మంత్రి నాదెండ్ల మనోహర్ దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.